# మానినీ మానసం

'రా రాధా !—లోపలికి రా! — వీరే మా అమ్మ గారు !' శేఖర్ పరిచయం చేశాడు.

"నమస్కా ర మండి ! —"

"అట్లా కూర్చోమ్మా !—" యెదురు సోఫా చూపారు జానకమ్మగారు.

"అమ్మా!- నీతో చెప్తూవచ్చానే... ఈమే రాధ- రాధా ! నువ్వు అమ్మతో మాట్లాడుతూ వుండు... నేనిప్పుడే డ్రస్సు మార్చుకువస్తాను. అనేసి చరచరా యింట్లోకి వెళ్లాడు శేఖర్.

---

అక్టోబరు '67 సుధలో ప్రచురితము

"శేఖర్ నాతో అన్ని విషయాలూ చెప్పాడు రాధా! ఎప్పుడూ నీమాటే అంటూ వుంటాడు ఇంట్లో !- అందుకే నిన్ను స్వయంగా కలుసుకుందామని, తీసుకురమ్మని చెప్పాను వాడితో."

"అట్లాగా!-చాలా సంతోషం!"

"ఈ రోజుతో మీ పరీక్షలు అయినట్లేనా ?"

"అవునండీ!-" అంది ముక్తసరిగ.

"పరీక్షలు బాగా వ్రాసినట్లేనా!"

"పర్వాలేదండీ !- క్లాసు రావచ్చు!"

"పోనీలే రాధా !- మాకు కావలసిందీ అదేగా. పిల్లలు యెదిగి చేతికొస్తే తల్లిదండ్రుల కష్టాలు గట్టెక్కినట్లే!... అదిసరే...నువ్వు మరివెంటనే బయల్దేరి మీవూరు వెళ్తున్నావని అబ్బాయి చెప్పాడు..."

"అవునండీ !- ఈ రాత్రి బండికే బయల్దేరి వెళుతు న్నాను. నాన్నగారిని స్టేషనుకు రమ్మని టెలిగ్రాంకూడ యిచ్చాను..."

"తప్పదా ?—"

"శేఖర్ కూడ నాలుగు రోజులపాటు యిక్కడే వుండమని బలవంతం చేశాడు—కానీ వెంటనే వెళ్ళక తప్పదు!-"

"చూడు రాధా !- అబ్బాయి నాతో విషయం చెప్పాడు. మరి...నువ్వేమంటావమ్మా ?- నీ అభిప్రాయం కూడా తెలుసుకుందామనే పిలిపించాను."

సిగ్గుపడ్డ రాధ ముఖంలో లేతగులాబిరంగు మొగ్గ వేసింది. ఎటో చూస్తూ మౌనంగా వుండిపోయింది.

"సిగ్గుపడితే యెట్లా ?- నా దగ్గర దాస్తావెందుకు ?- చూడు రాధా !- ఇవి జీవితాలకు సంబంధించిన విషయాలు- ఒక్క నాటితో తెగిపోయేవి కావు!—మనం ఒక నిర్ణయానికి రాబోయేముందే దాన్నిగురించి లోతుగా ఆలోచించాలి !- తర్వాత విచారించి ప్రయోజనం వుండదు!- మన నిర్ణయం సరైనదికాదని తర్వాత తెలిసి బాధపడటం అవివేకం. అందుకే విషయాలన్నీ నీతో ముఖాముఖీన మాట్లాడితే బావుంటుందనే పిలిపించాను- మనం మేడమీదికెళ్ళి తీరుబడిగా మాట్లాడు కుందాం ... రా!-" అంటూ రాధతోబాటు మేడమీదకు దారితీసింది జానకమ్మగారు.

కుర్చీలో కూర్చున్న రాధ చేతిగోళ్ళను పళ్ళకు తాకిస్తూ శబ్దం చేస్తున్నది.

ప్రక్కనే కూర్చున్న జానకమ్మగారు నిశ్శబ్దాన్ని భంగ పరుస్తూ "ఏమమ్మా... ఏమిటాలోచిస్తున్నావ్ ?-"

"అబ్బే ... ఏంలేదండి ?"

"నువ్వు దేన్నిగురించి అంతతీవ్రంగ ఆలోచిస్తున్నావో నాకు తెలుసు. అయినా, నేను ముఖ్యంగా కలుసుకోవాలను కోవటంలో వుద్దేశ్యం వూహించావనుకుంటాను !-"

"కొంతవరకు వూహించగలిగాను !"

"అంటే-?"

"అదే... నా గురించి పూర్తి వివరాలు తెలుసుకుంటే బావుంటుందని !"

"అంతేకాదు- అంతకంటే ముఖ్యమైన విషయాలు కూడా-"

"అందుకు నేనూ సిద్ధపడే వచ్చాను."

"చాలా సంతోషం- చూడమ్మా! ఓ ప్రశ్న అడుగుతాను... నువ్వేమీ అనుకోవుగదూ?"

"ఏమిటండీ అది?"

"నా ప్రశ్న బహుశ నీ తుదినిర్ణయాన్ని భంగపరుస్తుందేమోనని సంకోచిస్తున్నాను..."

"ఏది ఏమైనా, నా నిర్ణయం మీకు వ్యక్తం చేయాలనే వచ్చాను."

"శేఖర్ గురించి నీ అభిప్రాయం?"

"మీకు తెలిసిన విషయాన్నే, నానుండి చెప్పించాలని కోరుతున్నారా?"

"నాకు తెలుసు రాధా! కానీ నువ్వు శేఖర్‌ను ప్రేమిస్తున్నానంటున్నావే... ఆ విషయాన్ని... నువ్వెంతవరకు సమర్థించగలవ్?"

"ఊరెళ్ళగానే, నాన్నగారికీవిషయం చెప్పి వప్పించి, మీవద్దకు వారిని పంపగలననే ధైర్యం నాకుంది... పోతే... మీ అంగీకారమే నాక్కావాలి."

"చూడు రాధా! ప్రేమించుకునేటప్పుడు మీలో వుండే వుత్సాహం, పట్టుదల పెద్దవాళ్ళతో చెప్పి వప్పించేటంత సులభం కాదు!-"

"మీ రెందు కట్లా సందేహిస్తున్నారో అర్థంకావటం లేదు."

"నిజమే- మీ యిద్దరూ హృదయాలు యిచ్చి పుచ్చుకొని వుండొచ్చు, నే కాదనలేను!-కానీ... నువ్వు ఆడ పిల్లవు నీ వెనుక నీ శ్రేయస్సుకోరే బాధ్యతగల తల్లి దండ్రు లున్నారు. వాళ్ళు నీమీద నీ భవిష్యత్ మీద మరోవిధమైన ఆశలు పెట్టుకుని వుండొచ్చు!- నీ అభిప్రాయాలు తల్లిదండ్రు లతో ఏకీభవించనప్పుడు, నీ ఆశలు ఫలించనప్పుడు, నీ నిర్ణ యాలు ఏంగాను?- నీ పరిస్థితి ఏమవుతుంది ?- వారిని వప్పించే శక్తిలేక ప్రేమించినవారిని పెళ్ళాడలేక... నీ పసిహృదయం నలిగి పోతుంది !- తర్వాత విచారించి ప్రయోజనం వుండదు!! బాగా ఆలోచించు రాధా !"-

"క్షమించండి !- మీరిలా నిరుత్సాహపరుస్తారనుకో లేదు"

"అదిగాదు రాధా !- నేనిప్పుడు నీకేం చెప్పినా అర్థం కాదు—పెద్దవాళ్ళు ఏదిచెప్పినా అనుభవంతోనే చెప్తారు!- నే చెప్పేమాటల్లో నిజం నీకు కన్పించక పోవచ్చు. మీకై మీరే ప్రేమించుకున్నంత మాత్రాన పెళ్ళి చేసుకోగల రనుకోవటంలో అర్థంలేదు... తర్వాత పరిస్థితులు అనుకూలిం చక పోవచ్చు !"

"మా నాన్నగారు నామాట యెన్నటికీ కాదనరు. ఆ నమ్మకం నాకుంది—వారిని ఒప్పించగలననే ధైర్యమూ నాకుంది!!-"

"అదే పొరపాటు—శేఖర్ మగవాడు, ప్రేమించా ననటంలో అర్థముందేమోగాని... తండ్రిచాటు పిల్లవైన నువ్వు

ఆమాట అంటుంటే నాకు ధైర్యం చాలటంలేదు—పిల్లవాడి తల్లినైన నేను నిన్ను కోడలిగ చేసుకునేందుకు సిద్ధంగా వున్నా; నీతల్లి దండ్రులకు మాసంబంధం నచ్చకపోవచ్చు!- నీవు చెప్పినదానికి వప్పుకోక పోవచ్చు!—ఆ తర్వాత అందరి మధ్య నలిగి బాధపడవలసిన దానివి నువ్వు!—'

"నా ఇష్టం లేకుండ మానాన్న ఎప్పటికీ అట్లా చేయరు!"

"నా బాధ అదిగాదమ్మా!—నీవు నీ యిష్టాన్ని మీ వారికి చెప్పగల ధైర్యం నీకున్నా, వారి పరిస్థితులు విశదంగా నీకు చెప్పి, నీ మనసు మార్పించగల పట్టుదల ధైర్యం, తల్లిదండ్రులలో కావలసినంత వుంటుంది—అప్పుడు ఎవ్వరం ఏమీ చేయలేం?!- చివరకు నీకు మిగిలేది మాత్రం కన్నీరు."

"నాలో ఆ ధైర్యం లేకపోతే ఈ విషయం నేను మీతో మాట్లాడేందుకు సాహసించి వుండేదాన్ని కాదు—మా నాన్నగారి మనసు నాకు బాగా తెలుసు. నామాట కాదని నన్ను నిర్బంధిస్తారని నే ననుకోను — అందుకే అన్నాను నేవెళ్ళగానే వారిని వెంటనే పంపుతానని..."

"ఒకవేళ నువ్వనుకున్నట్లు జరుగక పరిస్థితులు తారుమారై అవకాశం చేయిజారిపోతే..."

"అట్లా జరుగదనే ఆశిస్తున్నాను—ఒకవేళ దురదృష్ట వశాత్తు ఆ విధంగా జరిగితే... నే నసలు పెళ్ళే చేసుకోను. జీవితాంతం అవివాహితగానే వుండిపోతాను!—"

"చాలా తొందరపడుతున్నావ్ రాధా! కలలోకూడ అలాంటి నిర్ణయాలకు రావద్దు!-అందులోని బాధ నీకు తెలీదు. పంతాలకోసం జీవితాలను నాశనం చేసుకోకూడదు. మాట నిలబెట్టుకోనటం అనుకున్నట్లు చేయగలగటం నువ్వనుకున్నంత తేలికగాదు!—" అంటున్న జానకమ్మగారి కళ్లు చెమ్మ గిల్లాయి.

"అదేమిటండీ!...వున్నట్టుండి అలా అయిపోయారు?"

"ఏంలేదు రాధా —మనం చేసుకున్న నిర్ణయాల కొరకు ఆశలను చంపుకుని, పంతాలకోసం ప్రాకులాడి, జీవిత సారభాన్ని వృధాకానీయటం పొరపాటు!- అలాంటి వారిలో నేనూ వున్నాను. అందుకే ప్రేమించుకు పెళ్ళిళ్ళు చేసుకునే వారుంటారంటే నాకు నమ్మకం లేదు—మనసిచ్చిన మహా నేరానికి, ప్రతిఫలంగా ప్రాయశ్చిత్తం నేను ఆ జన్మాంతం అనుభవించాల్సి వచ్చింది!—మాటకోసం కట్టుబడిన నేను... అర్ధానందంతో జీవితాన్ని నెట్టుకొస్తున్నాను"

"అయితే...మీకు మా వివాహం."

"ఇష్టంలేదనికాదు...నిన్ను పిలిపించటంలోగల అంత రార్థం నీకు తెలీకుండావుంది— కేవలం మీరు మనస్సిచ్చు కున్నంత మాత్రానే సరిపోదని నా వుద్దేశ్యం!...అంనుకని"

"మీరేమంటున్నారో నాకర్థం కావటం లేదు"

"మరోమారు ఆలోచించి నీ నిర్ణయాన్ని మార్చు కుంటేనే బావుంటుంది—"

"క్షమించండి-ఇదేనా మాగురించి మీరు అర్థం చేసుకుంది?- శేఖర్ లేకపోతే నాకు జీవితమేలేదు - అలాంటి

జీవితం గడిపే ఓర్పు నాకు లేదు. అయినా. .కాదని చెప్పేం దుకు మీరు నన్ను యింతదూరం పిలిపించాలా ??- నా చివరి మాట కూడా వినండి !-మీరు కాదన్నా శేఖర్ నన్ను కాదనడు-"

"రాధా- నీ మనసు కష్టపెట్టాలని గానీ, మరే వుద్దేశ్యంతోగానీ నిన్ను పిలిపించలేదు. నన్ను అనవసరంగా అపార్థం చేసుకోకు- నామాటల్లో అంతరార్థం గ్రహించలేక పోతున్నావ్?—ఇంతకంటే నీకు యేవిధంగ నచ్చచెప్పాలో నాకు తెలియకుండావుంది? సరేనమ్మా నీయిష్టం- నా అభి ప్రాయం చెప్పాను తర్వాత మీ అదృష్టం"

"ఈ విషయంలో మీ మనస్సు నొప్పించివుంటే క్షమించండి !"

"అట్లాగే రాధా ! పరిస్థితులు అనుకూలిస్తే కాదనేం దుకు మనం యెంతటివాళ్ళం ? శేఖర్ పిలుస్తున్నాడల్లేవుంది. వెళ్దాం పద !"

ఇద్దరూ మేడదిగి క్రింద హాల్లోకి వచ్చారు.

"ఏమిటమ్మా ? రాధ కేదో గీతోపదేశం చేస్తున్నావ్?" అని శేఖర్ అనటంతో ముగ్గురూ నవ్వుకున్నారు.

పెద్దవయస్సులోవున్న మూర్తిగారి కోరికల్లా, రాధను ఒక యింటిదాన్ని చేస్తే, బాధ్యత తీరి హాయిగా కృష్ణా రామా అనుకోవచ్చునని, వారి హోదాకు, అంతస్థుకు తగిన సంబంధాలకోసం వెతుకుతున్నారు.

వారి కాబోయే అల్లుడిని యిల్లరికం తెచ్చుకోవాలని వారి అభిలాష-ఆధునిక తరహాకు చెందిన మన స్తత్వ మవటం చేత, రాధను పైచదువుకోసం దూరాభారం వంటరిగా పంపేందుకు వెనుకాడలేదు.

వయస్సొచ్చిన తర్వాత యెవరి బాధ్యతలు వారివి అనే భావాలు కలవారు మూర్తిగారు. అందుకే రాధ ఏంచేసినా ఏది అడిగినా సరేననటం వారి అలవాటు.

సాయంత్రం ఆరుగంటలు కావస్తోంది. నలుమూలలా సంధ్యాచీకట్లు అలుముకుంటున్నాయి. సూర్యభగవానుని తేజస్సు కాంతి విహీనమై పశ్చిమ ప్రాంగణంలోకి జారబడి దిగంతాలకు దొర్లి పోతున్నాడు.

మేడమీద పచార్లు చేస్తోంది రాధ.

"రాధా ! ఏం చేస్తున్నావమ్మా ?" మేడమెట్లెక్కుతూ వచ్చినందుకు ప్రయాసపడుతు అడిగారు మూర్తిగారు.

"ఏం చేయటంలేదు నాన్నా ! ... ఉట్టినే పచార్లు చేస్తున్నాను !"

"అట్లా కూర్చోమ్మా ! కాస్సేపు తీరుబడిగా మాట్లాడుకుందాం !"

ఇద్దరూ కూర్చున్నారు.

"అయితే రాధా ! డాక్టర్ కాబోతున్నావ్ ? బాగానే వుంది. తర్వాత ఏం చేయాలనుకుంటున్నావు ?

"మన వూళ్లోనే ప్రాక్టీస్ పెడతాను నాన్నా."

"చాలామంచిదమ్మా !... అదిసరే... ఆ తర్వాత ?"

ప్రశ్న అర్థం కానట్టు తండ్రివైపు చూచింది.

"అదేనమ్మా! నిన్ను ఒక యింటిదాన్ని చేస్తే... అక్కడితో నా బాధ్యత తీరుతుంది. ఏమంటావు?"

"పెళ్ళికి తొందరేమొచ్చింది నాన్నా!"

"అట్లాకాదమ్మా! పెళ్ళీడుకొచ్చిన ప్రతి ఆడపిల్లా యిలాగే అనటం సహజం!"

నవ్వి వూరుకుంది రాధ—

"చూడు రాధా!- మొన్న నా స్నేహితుడు రంగనాథం జాబు వ్రాశాడు. వాడి అబ్బాయి అమెరికానుండి కొద్దిరోజుల్లోనే తిరిగి రాబోతున్నాడట. రాగానే, నిన్ను కోడలుగా చేసుకునేందుకు అభ్యంతరంలేదని వ్రాశాడు ... రాధా! నేనూ, వాడు యిద్దరంకలసి వకేచోట చదువుకున్నాం- నాకు ముఖ్యమైన స్నేహితుడల్లా వాడొక్కడే!- అలాంటి వాడికి ప్రయోజకుడైన కొడుకున్నాడూ అంటే, నే నెంతో గర్విస్తున్నాను!... అదే మనకు తగిన సంబంధం అని నా వుద్దేశ్యం... నువ్వేమంటావమ్మా?" అని ఆత్రుతగా రాధ కళ్ళల్లోకి చూశాడు.

మౌనంగావున్న రాధ దూరాన గాలికి కదులాడుతున్న చెట్ల ఆకులను తదేకంగా చూస్తున్నది—

"మాట్లాడవేం రాధా? నీ అభిప్రాయం కూడా చెప్పమ్మా! నీ కిష్టమైతేనే సంబంధంకోసం ప్రయత్నిద్దాం! లేకుంటే మరొకటి. నీకు కష్టంగావుండేపని నే నెప్పుడు చేయ లేదు"

"నాన్నా ! నేనసలు పెళ్ళి చేసుకోను."

"అదేమిటి రాధా ? యెందుకని ?"

మనసులో మెలికలు తిరుగుతున్న తన నిర్ణయాన్ని, శేఖర్ విషయం తండ్రితో యెట్లా ప్రస్తావించటమాని తీవ్రంగా ఆలోచిస్తున్నది.

"రాధా ... నే నొక్కటడగనా ?"

"అడగండి నాన్నా !"

"ఈ విషయంలో నీవేదైనా నిర్ణయానికొచ్చివుంటే చెప్పమ్మా ! సంకోచిస్తావేం ? నేనుమాత్రం కాదంటానా ?"

"మీతో చెప్పాలనే నేనూ అనుకుంటున్నాను !— కానీ ..."

"చెప్పు... పర్వాలేదు!"

"శేఖర్ నా కాలేజిమేటు - అతని అమ్మగారితో కూడా మాట్లాడాను- మీరు అంగీకరిస్తే వారికే అభ్యంతరమూ లేదట."

"చూడమ్మా ! అతనిలో ఏం చూచుకు ప్రేమించావని నే నడుగను... కానీ సరే ! నీకిష్టమై ఒక నిర్ణయానికొచ్చిన తర్వాత, నేను ఏం చెప్పి ప్రయోజనం వుండదని నాకు తెలుసు. సరే అట్లాగేకానీ ! నే వెంటనే బయల్దేరి వెళ్ళి విషయాలు మాట్లాడి సంబంధం ఖాయంచేసి వస్తాను" అని క్రింది కెళ్ళిపోయారు మూర్తిగారు.

రాధ ఆనందం, చంద్రుని చల్లదనంతో పోటీపడ్డది.

♦ ♦ ♦

జానకమ్మగారు తలుపుతీసి పైట సవరించుకుంటు "ఎవరు కావాలండీ ?" అడిగింది.

"అబ్బాయి శేఖర్ యిల్లు ఇదేనాండి ?"

"అవును యిదే. లోపలికిరండి" అనేసి చరచరా ఇంట్లోకి దారితీసింది.

"చూడమ్మా ! మాది విజయవాడ. అబ్బాయి లేడా ?"

"కూర్చోండి ! వాళ్ళ మామయ్యకు జబ్బుగావుందని వుత్తరమొస్తే మొన్ననే మద్రాసు వెళ్ళాడు ... తిరిగి రేపో, మాపో వస్తాడు. మీరు ఇదేనా రావటం ?"

"అవును, ఆలస్యం చేస్తే బాగుండదని అమ్మాయి చెప్పగానే బయల్దేరి వచ్చాను."

"చాలాసంతోషం" అనేసి లోపలికెళ్ళిన జానకమ్మ చెంబుతో నీళ్లు, టవలు తీసుకువచ్చి "కాళ్ళుకడుక్కోండి తర్వాత తీరుబాటుగా మాట్లాడుకోవచ్చు ఈలోగ కాఫీ ప్రయత్నం చేస్తాను" అంది.

"అబ్బే - అలాంటివేమీవద్దు. మీరు అనవసరంగా శ్రమతీసుకోకండి నేను వస్తూ తోవలో త్రాగేవచ్చాను పైగా గతికితే అతకదని అంటారు. అనేసి పంచపాళీలోవున్న మెట్ల దగ్గర కాళ్ళు కడిగి తిరిగి వచ్చి కుర్చీలో కూర్చుని తుండుతో కాళ్ళు తుడుచుకో నారంభించారు మూర్తిగారు.

"కాఫీ తీసుకోండి " తెచ్చిన కాఫీ టీపాయిమీద వుంచారు.

"ఎందుకండి?—ఏమిటో మీరు చాలా మొహమాట పెడుతున్నారు —మేము ఆడపిల్ల వైపు వారమని మర్చేపో యారా?" చమత్కారంగా చలోక్తి విసిరారు మూర్తిగారు.

"మర్యాదలకు అలాంటివేమీ అడ్డురావు లెండి"

"అదిసరే... నేను... రాధ తండ్రినని రాగానే యెట్లా వూహించగలిగారు?-" కాఫీ కప్పు చేతిలోకి తీసుకుంటు ఆశ్చ ర్యంగా అడిగారు.

"మా యింటికి రావలసిన, మేము యెదురు చూస్తున్న బంధువులు వేరే యెవ్వరూ లేరు!—రాధ చెప్పిన మాటలను బట్టి మీకోసం శేఖర్ రోజూ స్టేషన్‌కూడ వెళ్ళి వస్తు న్నాడు."

"అట్లాగా"

"రాధ అంతా మీపోలికే. అందుకే త్వరగా గుర్తించ గలిగాను. అయినా, ఆడపిల్లకు తండ్రి పోలికవస్తే అదృష్ట వంతురా లవుతుందంటారు."

"ఆ!... పోలికలు యెవరివైనా, అదృష్టా లెట్లా వుం టాయో మనం చెప్పలేంగా?—మనం ఒకటి అనుకుంటే విధి మరోరూపంలో మనలను నడిపించవచ్చు. చూడండీ! రాధ నాతో అన్ని విషయాలు చెప్పింది!"

"నాతోనూ మాట్లాడింది — నే చెప్పదల్చుకున్నది నేనూ చెప్పాను."

"అంటే?"

"మరేంలేదు - తల్లిదండ్రులచాటు ఆడపిల్లలు ధైర్యం చేసి స్వతంత్రమైన నిర్ణయాలకు రావటం మంచిదిగాదని"

"అమ్మాయికి నామనసుబాగా తెలుసు. అందుకే అంత ఖచ్చితంగా మీతో విషయాన్ని చెప్పి, ఆమె నిర్ణయాన్ని కూడా చెప్పివుంటుంది"

"ఏది ఏమైన ప్రేమ వివాహాలు జరుగుతాయంటే నాకు వాటియందు నమ్మకం లేదు — చూడండి! రాధ అంతా మీ పోలికేగదా... అదృష్టంలో కూడ మిమ్మలనే అనుకరిస్తే?"

ప్రశ్నార్థకంగా జానకమ్మగారి కళ్ళల్లోకి చూచారు మూర్తిగారు.

"మరేంలేదు, పెద్దవారినిబట్టే పిల్లలు. అంచేత రాధకు మీ పోలికలే వస్తేమాత్రం ఈ పెళ్ళి జరుగదేమోనని నా భయం"

"అదేమిటి?-మీరలా యెందుకు సందేహిస్తున్నారు?"

"సమయం అట్లాంటిది—అయినా భవిష్యత్ ను వున్నంతగా వూహించుకున్న మీరు బహుశ గతాన్నిమరచి పోయి వుండచ్చు."

జానకమ్మ మాటతీరు, ఆమెధోరణి అర్థంకానట్టు కళ్ళల్లోకి నిశితంగా చూశారు మూర్తిగారు. ఆమె అసందర్భముగా యెందుకలా మాట్లాడుతున్నదో? పైగా పూర్వ పరిచయ మున్న వ్యక్తితో సంభాషించినట్లు యెందుకుమాట్లాడుతున్నదో వూహించలేని మూర్తిగారు విస్తుపోతున్నారు.

"మూర్తిగారూ! మిమ్మలను నేను తిరిగి చూడగలుగుతా ననుకోలేదు. అట్లాంటి అవకాశం విధి కలిగించినందుకు

చాలా సంతోషం — కానీ ... నన్ను మీరు యింకా గుర్తించనేలేదు. అదీ ఒకందుకు మంచిదే అయినా యిప్పుడు గతాన్ని తవ్వి విమర్శించుకున్నందువల్ల, గాయపడ్డ నా హృదయం మరింత క్షోభించటం తప్ప నాకు మిగిలేదేమీ లేదు."

మాటలు వింటున్న మూర్తిగారు జానకమ్మని మరో మాటు ఆపాదమస్తకం పరీక్షించారు—కళ్ళకు జోడు, కొద్దిగ నెరిసిన తల విచిత్రంగావున్న ఆమె మాటల తీరు చూచి యెవరై వుంటుందాని పోల్చుకోలేని స్థితిలోవున్న మూర్తిగారు సరైన నిర్ణయానికి రాలేక సతమతమవుతున్నారు.

"ఎందుకట్లా ఆశ్చర్య పోతారు? ఒకప్పుడు మీ ప్రాణంకంటె ప్రాణంగా గౌరవించి మీ హృదయంలో విలువ కట్టిన నన్ను గుర్తించ లేకపోవటం నాదురదృష్టం. ముఫ్పై ఐదువసంతాలు మనిద్దరి సన్నిహితత్వాన్ని, పరిచయాన్ని దూరంచేశాయి— గతాన్ని త్వరగా మరచిపోగలిగిన మీ లాంటి వారూ, అందులోను మగవారు; మనుష్యులను, వారి విలువలను మరచిపోయారనుకోవటంలో ఆశ్చర్యం లేదు" అంటూ కంటిజోడు చేతిలోకి తీసుకుంటు మూర్తిగారికి మరింత దగ్గరగావచ్చి నుంచున్నది జానకమ్మ.

మూర్తిగారి కళ్లు బైర్లు కమ్మినట్లు, తల తిరుగుతున్నట్లూ అన్పించింది. దిగంతాలకు దొర్లిపోయింది మూర్తిగారి మనసు. జీర్ణించిన స్మృతుల పాతపుటలను తిరగవేసేందుకు ప్రయత్నిస్తున్నారు. చిన్ననాటి విషయాలు జ్ఞాపకానికివచ్చి లీలగా కళ్ళ ముందు మెదిలాయి!-

"లా" పూర్తిచేసిన సంవత్సరం పది రోజులపాటు సరదాగా గడిపేందుకై మేనమామ దగ్గరకు హైదరాబాద్ వెళ్ళారు మూర్తి.

మూర్తి మామయ్యకు పిల్లలు లేని కారణంతో, చాలారోజులు అక్కడే వుండిపోయాడు. మామయ్యగారింట్లో ప్రక్కభాగంలో మరొకరు అద్దెకుంటున్నారు.

చిన్నప్పటినుండి చలాకిగా తిరుగుతు, తాను నవ్వుతూ యెదుటివారిని నవ్విస్తు మాట్లాడే స్వభావంకలవాడు మూర్తి. అంచేతనే వచ్చిన మొదటి రోజుల్లోనే ప్రక్కవాటాలో అద్దెకుంటున్న శాంతమ్మగారి చెల్లెలు జానకిచే ఆకర్షింపబడ్డాడు మూర్తి.

శాంతమ్మ చాల మంచివ్యక్తి. ఎదుటివారిని త్వరగా అపార్థం చేసుకునే మనిషి కాకపోవటంతో మూర్తి యెక్కువ సేపు వాళ్ళింట్లోనే వుంటూ కబుర్లు చెప్తూ కాలక్షేపం చేస్తుంటే ఏమీ అనేదిగాదు శాంతమ్మ. శాంతమ్మ మంచితనం మూర్తికి మరింత చేయూత నిచ్చింది. పైగా జానకి మూర్తికినచ్చి హృదయాన్ని ఆకర్షించటంతో వంటరి సమయాల్లో మాట్లాడాలని ప్రయత్నించటం, నవ్వించటం చేస్తూ వచ్చాడు.

శాంతమ్మ సంస్కారమున్న మనిషి అవటంతో జానకితో మూర్తి చనువుగ మాట్లాడటం ఆమె కంటబడినా ఏమీ అనుకునేదికాదు. అంతేకాక, మూర్తివంటి మంచి కుర్రాడిని చూచి జానకికిచ్చి పెళ్ళిచేస్తే బావుంటుందని వువ్విళ్ళూడు

తుండేది. శాంతమ్మగారి మంచితనం, స్తబ్దత మరింత ఉద్రేక పరిచాయి మూర్తిని. అందుకే పెళ్ళి చేసుకుంటే జానకినే చేసుకుంటానని మనసులో మాట సూటిగ వెలిబుచ్చుతు వచ్చాడు శాంతమ్మతో. సంబరపడ్డది శాంతమ్మ.

జానకి ఆనందానికి మేరల్లేవు. మూర్తి మాట నమ్మటంతో మూర్తిఅంటే చెప్పలేని అభిమానం, ప్రేమ జానకి హృదయంలో బలీయంగ పీఠం వేసుకున్నాయి.

చనువుగ మాట్లాడే మూర్తిమాటలకు చిలిపిగ సమాధానం చెప్పేది జానకి. కవ్విస్తూ కళ్ళల్లోకి చూచి నవ్వేది. మూర్తికూడ రోజురోజుకు జానకిని మరింత దగ్గర చేసుకుంటున్నాడు.

ఓ రోజున మూర్తి అత్తయ్య, మామయ్య సినిమా కెళ్ళారు. శాంతమ్మ పురాణానికి వెళ్ళింది. దొరికిన అవకాశాన్ని జారవిడవ తలుచుకోలేదు మూర్తి.

రాత్రి ఏడుగంటలు కావస్తోంది.

డాబామీద వెన్నెల్లో వంటరిగా కూర్చున్న జానకిని సమీపించాడు మూర్తి.

తెల్లని వుల్లిపొరలాంటి చీర వెన్నెల వెలుగులో కలిసిపోయింది. జానకి మల్లెపూలజడ మూర్తిని మరింత మత్తెక్కించింది. అందమైన జానకి చిరునవ్వు మూర్తిని మరింత వుసికొలిపింది. జానకి అందం, లావణ్యంచూచి ముగ్ధుడైన మూర్తి మమకారానికి, మనస్సుకు మరింత దగ్గరయ్యాడు.

ఎవరు ముందు పలుకరించాలాని యిద్దరూ పోటీపడుతు వకరి ముఖాలు వకరు చూచుకుంటున్నారు.

"ఏమండీ! నన్ను పెళ్ళాడేందుకు మీవాళ్ళు యిష్ట పడకపోతే ?" అరమోడ్పు కన్నులతో, అందాన్ని రంగరించి వొలికించే వోరచూపులతో అడిగింది.

"అట్లా యెన్నటికీ జరుగదు! మావాళ్ళు నామాట కాదనరు."

"నా కెందుకో భయంగా వుంది..."

"ప్రేమించి మనసిచ్చిన ప్రతిమగువ నీలా అనుకోవటం సహజం! కాని, నేను అందరిలాంటి వ్యక్తిని కాదు. ఓసారి నిర్ణయానికి రావటం జరిగితే అందుకు తిరుగులేదు - నామాట నమ్ము జానకి!"

"మీమీద నమ్మకంతోనే అంత సాహసం చేస్తు న్నాను. అయినా, మీరు మగవాళ్ళు మనసిచ్చామంటారు. తర్వాత మరచిపోయామంటారు. పరిస్థితు లనుకూలించకపోతే గాయపడిన మనసు కుదుట పరచుకోలేక బాధపడేవాళ్ళం మేము."

"జానకీ! నువ్వేమి సందేహించవద్దు. నే వెళ్ళగానే మాయింట్లో ఈ విషయంచెప్పి ముహూర్తాలు పెట్టుకునేందుకు నాన్నగారిని పంపుతాను. సరేనా!"

మబ్బుల చాటునుండి తొంగిచూస్తున్న చంద్రుడు జీవితానుభవాలకు, ఆనందానికి మరింత దగ్గరవుతున్న మూర్తిని, జానకిని చూచి వెక్కిరిస్తున్నాడు.

"మూర్తిగారూ! గతాన్ని జ్ఞాపకం చేసుకోలేక పోతున్నారు గదూ?" అని జానకమ్మ అనటంతో మూర్తి గారి ఆలోచనావలోకనానికి అంతరాయం కలిగింది.

"జానకీ! నువ్వా- మనిషి ఎంతగా మారిపోయావు? నిన్ను గుర్తించనే లేకపోయాను. ఎన్నాళ్ళయింది నిన్ను చూచి?"

"క్షమించండి. నన్ను అట్లా పిలిచే హక్కు ఏనాడో పోగొట్టుకున్నారు. ఆనాడు మీరు చెప్పిన మాటలన్నీ ఏమయ్యాయి? మీ మగబుద్ధి చూపించారు."

"అదిగాదు జానకీ..." అనేదో సమర్థించబోయారు.

"ఏదికాదు? క్షమించండి. నన్నలా పిలిచి నా హృదయాన్ని మరింత బాధపెట్టొద్దు. ఒక్క-క్షణం ఆలోచించండి. ఈ జానకి ఏమైందో? ఎక్కడుందో? యిన్నాళ్ళూ మీ రెప్పుడైన అనుకున్నారా? వెళ్ళగానే మీ వాళ్ళను వప్పించి నన్నే చేసుకుంటానని నమ్మించి మోసంచేసి పోయారే... తిరిగి మళ్ళీ మీ ముఖమైన చూపించారా? అందుకు నా హృదయం యెంత గాయపడ్డదో- నా మనస్సెంత క్షోభించి పోయిందో మీకేం తెలుసు? మీకేం హాయిగా అందరినీ మరచిపోగలిగారు. కానీ- నేను... ప్రతి నిముషం మీకోసం యెదురుచూస్తూ, నా జీవితాన్ని మీకే అంకితం చేసుకుని యిలాగే వుండిపోయాను. గుండె రాయి చేసుకున్నాను. అయినా, నా బాధ యెవరికి కావాలి?"

"మరి... ఈ... శేఖర్?" అదోలా అడిగారు మూర్తి.

"మీ సందేహ మేమిటో నాకు తెలుసు. ఏం? మీరు నన్ను చేసుకోనంత మాత్రాన, నేను మరోవిధంగ సుఖపడేందుకు వీలేలేదా? అయినా మీరనుకున్నంత నీచంగ నేను వుండలేకపోయాను. మీరు మరచిపోయినంత తేలికగా నేను మిమ్మలను మరచిపోలేక పోయాను. పాపం! మా అక్కయ్య చచ్చి ఏలోకానున్నదో... పోతూ పోతూ పసికందును నా చేతుల్లోవుంచి ఆస్థితో బాటు బాబును కాపాడమనీ, నన్ను పెళ్ళిచేసుకు సుఖపడమనీ మరీ మరీ చెప్పి ఆమె కళ్ళు మూసింది. ఆమె మాటకోసం బాబును నా బిడ్డగా పెంచగలిగాను కానీ... మరొకరికి మనసిచ్చిన నేను సుఖపడేందుకు పెళ్ళిమాత్రం చేసుకోలేకపోయాను. అక్కయ్య ఆస్థి కాపాడటంకోసం గతాన్ని, బాధను మరచిపోవటంకోసం బాబు భవిష్యత్ మీద వున్నతమైన ఆశలు నిర్మించుకుంటూ యిన్నాళ్ళూ రోజులు గడుపుతూ వచ్చాను. అయినా మూర్తి గారూ! నాకిప్పుడిప్పుడే అర్థమవుతోంది మీరు యెంతటి సంకుచిత స్వభావులో. జరిగిపోయిన దానితో పనిలేదు. మీరు యిక్కడికి వచ్చిన పనివేరు... నేను యివ్వబోయే సమాధానం వేరొకటి—"

"జరిగిందానికి నేనెంతో బాధపడుతున్నాను జానకీ! నన్ను క్షమించు!- అసలు నా పెళ్ళి యెట్లా జరిగిందో, ఆ విధంగా యెందుకు జరగాల్సి వచ్చిందో యిప్పుడు నేను నీకు చెప్పినా నువ్వు అర్థం చేసుకోలేవు."

"పరిస్థితి ఏదైనా కావచ్చు. అందుకు బాధపడి జీవితం నాశనం చేసుకుంది నేను. నన్ను మరచిపోగలిగిన మీకు మళ్ళీ

ఈనాటికి నాతోనే అవసరం కలిగింది. వేరుచేసిన విధి మన లను మళ్ళీ యీ విధంగా కలిపింది. సరే... నా మాటకూడా వినండి... మీ నిర్ణయానికి నేనంగీకరించను."

"జానకీ !"

"హుఁ... జానకి! మీరు నన్ను యెట్లా పిలువగలుగుతున్నారు? మిమ్మల్నే నమ్ముకుని, మీమీదే ఆశలు నిలుపుకుని యెన్నాళ్లో మీకోసం యెదురుచూశానే- అలాంటి మీ జానకి ఏమైందోని వక్కమారు వెనక్కు తిరిగి ఆలోచించారా? మిమ్ములను ఆసాంతం అర్థంచేసుకోకుండా తొందరపడి మీకే మనసిచ్చాను. మీరే నాసర్వస్వం అనుకున్నాను. కానీ మీలాగ మనసు మార్చుకుని సుఖపడలేక పోయాను. నన్ను నా హృదయాన్ని గాయపరచి, నా భవిష్యత్తును నాశనం చేసిన మీకు, ఈ రోజును మళ్ళీ నాతో అవసరం కలిగింది. ఇప్పుడు అవసరం మీది. అవకాశం నాది. నేను కాదంటే రాధ భవిష్యత్ ఏమవుతుందో వక్కమారు ఆలోచించండి" అనేసి ముఖాన్ని రెండు చేతులమధ్య దాచుకుని పొంగివస్తున్న దుఃఖాన్ని ఆపుకో ప్రయత్నిస్తోంది జానకమ్మ.

మూర్తిగారి ముఖంలో నెత్తుటిబొట్టు కరువైంది. జానకమ్మగారనే ప్రతిమాట శూలంలాగ హృదయంలో గుచ్చుకోవటంతో మూర్తిగారి మనస్సును ఆసాంతం కలచివేశాయి. ఆయన చేతగానితనానికి పిరికితనానికి తననుతాను మనసులో నిందించుకో నారంభించారు. నిజమే. తను మగవాడుకాబట్టి జానకిని మరచిపోగలిగాడు. కాని- ఇప్పుడు అట్లాగే ప్రతీకారం

కోసం జానకి తనమాట కాదంటే? రాధ ఆశలు, భవిష్యత్ ఏమవుతాయి? అట్లా జరిగేందుకు వీల్లేదు."

"జానకీ- జరిగిందానికి నేనెంత బాధపడుతున్నానో నా హృదయం యెంత కుమిలిపోతున్నదో తెలుసా? మగవాడిని నేను మరచిపోగలిగాను. అంతేకాకుండా నీలో ఆశలు రేకెత్తించి నీ భవిష్యత్తును విషాదాంతం చేశాను. నిజమే తప్పునాదే" నువ్వు ఏశిక్ష విధించినా భరిస్తాను. కానీ నిన్ను కోరేదల్లా ఒక్కటే... మన విషయాన్ని ఆధారం చేసుకుని రాధను బాధలపాలు చేస్తావా? ఈ సంబంధం ఖాయంచేసుకు వస్తానని వెయ్యికళ్ళతో యెదురుచూస్తుంటుంది రాధ. నువ్వు కాదంటే, దాని హృదయం బ్రద్దలవుతుంది. రాధకు నేను ఏమని సమాధానం చెప్పేదీ? నువ్వే ఆలోచించు ..."

"మూర్తిగారూ- బిడ్డ భవిష్యత్ కోసం మీరెంత మధనపడుతూ రాధను సుఖపెట్టాలని తాపత్రయ పడుతున్నారో నాకు తెలుసు. కానీ... వక్కటి మాత్రం నిజం. మీరు వూహిస్తున్న స్వార్థం నాలోలేదు. ఆనాడు మీరు నన్ను కాదనగలిగారు కానీ ఇప్పుడు నేనట్లా అనలేకపోతున్నాను. ఆడదానిహృదయం ఎంతగా గాయపడుతుందో ఒకప్పుడు అదేబాధననుభవించిన నాకు బాగా తెలుసు. ప్రతీకారం తీర్చుకోవాలనే వుద్దేశ్యమే నాకుంటే, మీతో ఇంతసేపు మాట్లాడవలసిన అవసరం నాకులేదు. మన బాధవల్ల ఇతరుల భవిష్యత్ పునాది రాళ్ళనుపడగొట్టే హక్కు, అధికారం మనకులేదు. మిమ్మల్ని చూచికాకపోయినా నేను కాదంటే రాధ లేత హృదయం

యెట్లాక్షోభించి పోతుందో వూహించుకోగలిగిన నేను ... మీ మాట సరేననక తప్పదు ... నిండు మనస్సుతో ఈ సంబంధానికి అంగీకరిస్తున్నాను!'' అనేసి అశ్రుపూరితనయనాలను తుడుచుకో నారంభించింది జానకమ్మ.

“చాలా సంతోషం ... చాలా సంతోషం. నేను నీ కెంతో ఋణపడుతున్నాను. నేను నిన్ను ఒకప్పుడు కాదన్నా నువ్వు నాకీ ఉపకారం చేయటం ద్వారా నిజంగా ఆడమనసు గొప్పదనాన్ని నిలబెట్టావు'' అంటున్న మూర్తిగారి కళ్ళు ఆనందంతో మిలమిలా మెరిశాయి.